
క్లుప్తంగా

శ్యామలాంబకు ప్రత్యేక పూజలు



సామర్లకోట: అమావాస్య గురువారాన్ని పురస్కరించుకుని గొంచాల గ్రామ దేవత శ్యామలాంబ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గొంచాల, నవర, అచ్చంపేట గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయాన్ని, అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. గ్రామానికి చెందిన ముమ్మిడి లక్ష్మణరావు, నాగలక్ష్మి దంపతులు, నాగజోగేశ్వర దేవీప్రసాద్, వెంకట ధర్మ కౌశిక్, రేవంత్‌లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు సేవలందించారు.

వైఎస్సార్ సీపీ సమావేశానికి తరలిరండి

సామర్లకోట: వైఎస్సార్ సీపీ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు పిలుపునిచ్చారు. కాకినాడ సూర్య కళా మందిర్‌లో జరిగే ఈ సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల పదవులు పొందిన నాయకులు, అభిమానులు, కార్యకర్తలు రావాలన్నారు. స్థానిక పార్టీ కార్యాలయానికి వస్తే ఉదయం 8.30 గంటలకు కాకినాడకు భారీ ర్యాలీగా తరలి వెళ్తామన్నారు. రీజినల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరావాలని దొరబాబు విజ్ఞప్తి చేశారు.

ఏఎస్సైకి పరామర్శ

సామర్లకోట: పెద్దాపురం సబ్ డివిజన్ క్రైమ్ ఏఎస్సై గంగిరెడ్డి బలరామ్‌ను పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు గురువారం పరామర్శించారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విధులకు సెలవు పెట్టడంతో బలరామ్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు తదితరులు పాల్గొన్నారు.

నీటి శుద్ధి ప్రక్రియ పరిశీలన

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో ఉన్న సాంబమూర్తి రిజర్వాయర్ ప్లాంట్‌ను పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ గురువారం పరిశీలించారు. గోదావరి కాలువ నీరు ఫిల్టర్ చెరువులోకి చేరుతున్న విధానం, నీటి శుద్ధి ప్రక్రియను పరిశీలించారు. ఫిల్టర్ ప్లాంట్‌లో నీటిని శుద్ధి చేయడానికి అవసరమైన ఆలమ్, క్లోరిన్ స్టాక్‌ను చూశారు. సామర్లకోట నుంచి పెద్దాపురం వాటర్ ట్యాంకులకు తాగునీరు పంపింగ్ అయ్యే సమయంలో పైపులైన్ లీకులు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కౌన్సిలర్ త్సలికి సత్యభాస్కరరావు, మున్సిపల్ ఏఈ పీవీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కుళాయిల నుంచి బురద నీరు



కొత్తపల్లిలో కుళాయి ద్వారా వస్తున్న బురద నీరు

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాలకు వాకతిప్ప శివారు రక్షిత మంచినీటి పథకం ద్వారా గురువారం రంగుమారిన నీరు సరఫరా అయ్యింది. వీధి, వ్యక్తిగత కుళాయిల ద్వారా బురద నీరు రావడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తగిన చర్యలు చర్యలు తీసుకోవాలని కోరారు.

నడినెత్తిన యమపాశాలు

- ఇళ్ల మీదుగా విద్యుత్తు తీగలు
- ఇబ్బందులు పడుతున్న యజమానులు
- లైన్ల మార్పునకు షిఫ్టింగ్ చార్జీలు చెల్లించాలంటున్న అధికారులు



సామర్లకోట గణేష్ కాలనీలో ఇళ్ల మీదుగా వెళుతున్న 11 కేవీ విద్యుత్తు తీగలు

సామర్లకోట: విద్యుత్ నిత్య జీవితంలో ఎంత అవసరమో.. ఏదైనా ప్రమాదం జరిగితే అంతే సంగతులు. అందుకే విద్యుత్ వాడకంలో జాగ్రత్తలు తప్పనిసరని అంతా చెబుతుంటారు. అయితే నియోజకవర్గంలో ఇళ్ల మీదుగా విద్యుత్ తీగలు వెళ్తున్నా పట్టించుకునేవారే కరవవుతున్నారు. అధికారులు పట్టించుకోక అనేక మంది తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని పలువురు అంటున్నారు. ప్రజావసరాల నిమిత్తం విద్యుత్తును అందించడానికి అందుబాటులో ఉన్న స్థలాల నుంచి లైన్లు ఏర్పాటు చేశారు. ఆ లైన్ల దిగువ భాగంలో ఇళ్ల స్థలాలు ఉన్నవారు ఇళ్లు నిర్మించుకోవడంతో ప్రమాదాలు కొనితెచ్చుకొంటున్నారు. ఇళ్ల నిర్మాణాలు జరిగే సమయంలో ట్రాన్స్‌కో అధికారులు తనిఖీ చేసి హెచ్చరికలు జారీ చేయాల్సి ఉండగా, పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. సామర్లకోట బ్రౌన్‌పేట సమీపంలోని గణేష్‌కాలనీ, కందకంలో అనేక మంది పేదలకు స్థలాలు ఇవ్వడంతో ఇళ్ల నిర్మాణాలు చేసుకుంటున్నారు. వారి నివాసాలకు సమీపంలోనే విద్యుత్తు సబ్ స్టేషన్ ఉండటంతో 11 కేవీ విద్యుత్తు తీగలను ఆ ప్రాంతం నుంచి పట్టణం, ఇతర ప్రాంతాలకు ఏర్పాటు చేశారు.

ఎవరు ముందు అనే చందాన..

స్థానిక గణేష్ కాలనీలో ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు ప్రమాదాలు జరుగుతుండడంతో, గుడ్డు ముందా.. కోడి ముందా అన్న చందనా తయారైంది. ఇళ్ల నిర్మాణాలు చేసుకున్న లబ్ధిదారులు తమ ఇళ్ల మీదుగా విద్యుత్తు తీగలు వెళుతున్నాయని, వాటిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఇళ్లు లేని సమయంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు లైన్లను ప్రస్తుతం మార్పు చేయడం సాధ్యం కాదని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు. వాటిని మార్పు చేయాలంటే షిఫ్టింగ్ చార్జీలు చెల్లించాల్సిందేనని అంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని జీవిస్తూ ఉంటే.. షిఫ్టింగ్ చార్జీలు ఎలా చెల్లిస్తామని లబ్ధిదారులు వాపోతున్నారు. శ్లాబ్ వేసిన ఇళ్లపై ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి లైన్లను మార్పు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై అనేక పర్యాయాలు అధికారులకు ఫిర్యాదులు చేశామని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు.

విద్యుత్తు తీగలు మార్పు చేయాలి



బ్రౌన్‌పేటలో అనేక మంది పేదలకు సుమారు 30 ఏళ్ల కిందట ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాకలు వేసుకుని జీవించేవారు. క్రమేపీ ప్రభుత్వ ఆర్థిక సాయంతో కొంత మంది ఇళ్లు నిర్మించుకున్నారు. శ్లాబ్‌లు వేసుకున్న వారి ఇళ్ల మీదుగా విద్యుత్తు లైన్ వెళ్లడంతో సుమారు పదేళ్ల క్రితం ట్రాన్స్‌కో అధికారులకు లైన్ల మార్పు కోసం ఫిర్యాదు చేశాం. లైన్ల మార్పుకు షిఫ్టింగ్ చార్జీలు చెల్లించాలని అంటున్నారు. పేదలమైన మేం ఏవిధంగా ఫీజులు చెల్లించగలం.

–కొల్లి కుమారి, గృహిణి, సామర్లకోట

షిఫ్టింగ్ ఫీజు చెల్లించాలి



పిఠాపురం రోడ్డులో కందకంలో నివాసం ఉంటున్న వారి ఇళ్ల మీదుగా వెళుతున్న విద్యుత్ తీగలను మార్పు చేయాలని కోరారు. అయితే లైన్ల మార్పునకు ఫీజు చెల్లించాలని చెప్పాం. కనీసం రెండు స్తంభాల్లో ఒక స్తంభానికి ఫీజు చెల్లించాల్సి ఉంది. దానికి వారు అంగీకరించారు. ఫీజులు చెల్లిస్తే స్తంభాలు ఏర్పాటు చేసి లైన్లు మార్పు చేస్తాం.

–కిరణ్, ట్రాన్స్‌కో ఏడీఈ, సామర్లకోట

29న నవరలో బోనాల సంబరం



నవరలో ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారి ఆలయం

సామర్లకోట: నవర గ్రామంలో ఈ నెల 29వ తేదీ ఆదివారం ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారి బోనాల సంబరం నిర్వహిస్తామని సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు, ఆలయ ధర్మకర్త దమ్మాల లక్ష్మణరావు తెలిపారు. ఆషాఢ మాసం, చవితిని పురస్కరించుకుని బోనాల సంబరం చేస్తున్నామన్నారు. మూడేళ్లుగా బోనాల సంబరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ చెప్పారు. సర్పంచ్ దంపతులు బోనాలు ఎత్తుకుని ఉత్సవాన్ని ప్రారంభిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు. బోనాలతో గ్రామం అంతా పర్యటించిన తరువాత ఆలయానికి వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు శివసుబ్రహ్మణ్యం పూజాదికాలు నిర్వహిస్తారన్నారు. అనంతరం ఆలయం వద్ద భారీ ఎత్తున అన్నదానం చేస్తామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

మాదక ద్రవ్యాలను దూరం చేద్దాం



పెద్దాపురంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ



పిఠాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు ఉపాధ్యాయులు



పిఠాపురంలో బహిరంగ సదస్సు నిర్వహిస్తున్న పోలీసులు

పిఠాపురం : అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిషా ముక్త్ భారత్ అభియాన్‌ను కళాశాల ఎస్ఎంబీఏ కమిటీ, యాంటీ–నార్కోటిక్ ఈగల్ క్లబ్, నేషనల్ సర్వీస్ స్కీమ్ ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్, ఆర్ఆర్‌సీల ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి కళాశాల ప్రిన్సిపాల్ పి.సుభాషిణి అధ్యక్షత వహించి మాట్లాడారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎవరైనా మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు తెలిస్తే వెంటనే 100, 102, 1972 నంబర్లకు సమాచారం అందించాలన్నారు. సజ్జన్ సమాజ్ ఫౌండేషన్ డైరెక్టర్ ఎంఎం బాషా, కాలేజ్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు కేవీఎస్ ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ కె.ఉషశ్రీ, కె.ఆనంద్, యూవీబీబీ కృష్ణ ప్రసాద్, బి.అలీబాబా పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు వద్దు

పిఠాపురం: మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పిఠాపురంలో సీఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ కళాశాలల విద్యార్థులు, సచివాలయ పోలీసులు, సర్కిల్ పోలీస్ సిబ్బంది, న్యాయవాదులు, స్థానిక యువత, ఆటో డ్రైవర్లతో పిఠాపురం ఉప్పాడ సెంటర్లో బహిరంగ అవగాహన సదస్సు జరిపారు. అనంతరం ఉప్పాడ సెంటర్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకూ ర్యాలీ చేశారు. సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి మంచి మార్గంలో నడవాలన్నారు. పిఠాపురం పట్టణ, గొల్లప్రోలు, ఉప్పాడ కొత్తపల్లి, పిఠాపురం రూరల్ పోలీస్ స్టేషన్ల ఎస్సైలు ఎన్.రామకృష్ణ, వెంకటేష్, జాన్‌బాషా పాల్గొన్నారు.

సామర్లకోట: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు అన్నారు. పెద్దాపురం మున్సిపల్ సెంటర్ నుంచి ప్రారంభమైన అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీని డీఎస్పీ ప్రారంభించారు. ఇందులో పెద్దాపురం తహసీల్దార్ సీహెచ్ వెంకట లక్ష్మి, సీఐలు ఎ.కృష్ణభగవాన్, విజయశంకర్, ఎస్సైలు మౌనిక, మూర్తి, పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైనికుడు వినోద్‌కు ఘన సత్కారం



సైనికుడు సుబేదార్ వినోద్‌ను అభినందిస్తూ ర్యాలీ

సామర్లకోట: ఆపరేషన్ సిందూర్ యుద్ధంలో పాల్గొన్న పెద్దాపురం పట్టణానికి చెందిన దడాల సుబేదార్ వినోద్‌ను గురువారం ఘనంగా సత్కరించారు. పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు అధ్యక్షతన ఆయన స్వగృహంలో సన్మానం జరిగింది. ఈ సందర్భంగా సభా ప్రదేశానికి వచ్చిన సుబేదార్ వినోద్‌కు ఘన స్వాగతం పలికారు. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని మొదటిసారిగా సొంత పట్టణానికి వచ్చిన సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సూరిబాబు రాజు తెలిపారు. భారత్ మాతాజీ జై అంటూ సభా ప్రాంగణం మార్మోగింది. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో ఈ సన్మానం జరిగింది. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందుతో వ్యాధి నిరోధక శక్తి



కార్యక్రమంలో మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కృష్ణమూర్తి

సామర్లకోట: గొర్రెలు, మేకలకు ప్రతి ఏటా నట్టల నివారణ మందు వేయిస్తే, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని పశుసంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ కె.కృష్ణమూర్తి అన్నారు. నట్టల నివారణ మందు పంపిణీ సందర్భంగా గురువారం స్థానిక మండల పశు వైద్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రతి సీజన్‌లో ఏడాదికి నాలుగు పర్యాయాలు ఉచితంగా గొర్రెలు, మేకల పెంపకందారులకు నట్టల నివారణ మందు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఐఎస్‌డీపీ సహాయ సంచాలకులు డాక్టర్ దినకర్ మాట్లాడుతూ గొర్రెలు, మేకలు పెంపకందారులు సంఘాలుగా ఏర్పడితే సహకార సంఘాల ద్వారా రుణాలు తీసుకోవచ్చన్నారు. అదే విధంగా పశువుల దాణా 50 శాతం రాయితీపై ఇస్తామని తెలిపారు. ఈ సదుపాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సన్న జీవాల్లో వచ్చే వ్యాధులు, వాటి నివారణ విధానాన్ని జిల్లా వ్యాధి నిర్ధారణ విభాగం ఉప సంచాలకులు డాక్టర్ కృష్ణజ్వాల వివరించారు. పశు వైద్యశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ప్రమీళా, పశు వైద్యులు ఎం.భవాని, కిరణ్మయి, సౌమ్య, శివ ప్రసాద్, యశ్వంత్, రైతు సంఘ అధ్యక్షుడు కంటే బాబు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్లు గోలి వెంకట అప్పారావుచౌదరి, యార్లగడ్డ చిన్ని, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, కౌన్సిలర్ బలుసు వాసు తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు



కొంగోడులో పారిశుద్ధ్య నిర్వహణపై మహిళలను అడిగి తెలుసుకుంటున్న డీపీఓ రవికుమార్

కరప: గ్రామాల్లో అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు, వీధులు పరిశుభ్రంగా ఉండేలా రోజూ పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ సూచించారు. మండల పర్యటనలో భాగంగా గురువారం ఆయన డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాస రావుతో కలసి కరప మండలం కొంగోడు, పెద్దాపురప్పాడు గ్రామాల్లో పర్యటించి, పారిశుద్ధ్య పనుల నిర్వహణను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందికి, కార్యదర్శులకు సూచనలిచ్చారు. గ్రామస్తులను కలసి పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికీ వచ్చి తడి, పొడి చెత్త తీసుకువెళ్తున్నారో లేదో అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఇంటికి వచ్చినప్పుడు తడి, పొడి చెత్త విడదీసి ఇవ్వాలన్నారు. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల్లో తడి చెత్త నుంచి కంపోస్టు ఎరువును ఎలా తయారు చేస్తారో వివరించి, ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. కంపోస్టు ఎరువు తయారు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. గ్రామ పంచాయతీల్లో తక్కువ రేటుకు లభించే కంపోస్టు ఎరువుతో గృహాల్లో పూల మొక్కలు పెంచుకోవడానికి, కూరగాయలు పండించుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు.

ఉప్పాడ... సమస్యలే ఎడాపెడా



ఉప్పాడలో పేరుకుపోయిన వ్యర్థాలు



ఇళ్ల మధ్య నిలిచిపోయిన వర్షపునీరు

కొత్తపల్లి: ముంపు తిప్పలు... పారిశుద్ధ్య సమస్యలు.. దోమలతో అవస్థలు ఇలా ఒకటేమిటి అన్నీ ఇబ్బందులే. కొత్తపల్లి మండలంలో మేజర్ పంచాయతీ ఉప్పాడలో పరిస్థితి ఇది. ఈ గ్రామంలో ప్రధానంగా పారిశుద్ధ్య సమస్య తాండవిస్తోంది. ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోతుంది. కాలువల్లో పూడికలు సకాలంలో తొలగించక మురుగు ముందుకు కదలడం లేదు. ముఖ్యంగా పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాల సమీపంలో చెత్తాచెదారం నిండిపోతుంది. దీంతో విద్యార్థులు, చిన్నారులు రోగాల బారిన పడుతున్నారని తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమలు పెరిగిపోవడంతో రాత్రిళ్లు కంటి మీద కునుకు ఉండడం లేని స్థానికులు వాపోతున్నారు. దీంతో జ్వరాల బారిన పడుతున్నామని అంటున్నారు. పంచాయతీ అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇదిలా ఉంటే చిన్నపాటి వర్షానికే నీరు రోడ్లపైకి చేరుతుంది. అక్కడే రోజుల తరబడి నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. పారిశుద్ధ్య లోపంతో పాటు దోమల దాడితో పలువురు డెంగీ తదితర విష జ్వరాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఓ వీధిలో కదలని మురుగు

బురద... ఏమిటీ వ్యథ



గోతులు పడి అధ్వానంగా ఉన్న ఇరు శాఖల ఉమ్మడి మార్గం



బురదమయంగా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కార్యాలయ ప్రవేశ మార్గం

కాకినాడ క్రైం: స్థానిక ఫైవ్ బిల్డింగ్స్ సెంటర్ పైడావారి వీధిలో ఉన్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కార్యాలయ ఆవరణ పూర్తిగా బురదమయంగా మారింది. అదే ఆవరణలో ఉన్న ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మద్యం నమూనాల పరీక్షల కోసం ఓ ల్యాబొరేటరీ నిర్మాణం జరుగుతోంది. ఎక్సైజ్, ఫుడ్ సేఫ్టీ డిపార్టుమెంట్లు ఒకే ఆవరణలో ఉంటాయి. ఇరు శాఖల కార్యాలయాలను చేర్చే ఉమ్మడి మార్గం ఒకటుంది. ఆ దారిలో కొద్ది రోజులుగా నిర్మాణం కోసం భారీ వాహనాల్లో మెటీరియల్‌ను తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు, అధికారులను కార్యాలయాలకు చేర్చే ఉమ్మడి మార్గం పూర్తిగా ధ్వంసమైంది. గుత్తేదారు ఈ విషయాన్ని ఏ మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తుండడం ఫుడ్ కంట్రోలర్ ఆఫీస్‌లో పనిచేసే అధికారులు, సిబ్బందితో పాటు కార్యాలయానికి వివిధ అవసరాల కోసం వచ్చే సామాన్యులకు శాపంగా పరిణమించింది. మార్గం అధ్వానంగా మారుతన్నా కనీసం పట్టించుకోకపోవడంతో ఫుడ్ సేఫ్టీ శాఖ ఉన్నతాధికారులకు ఆగ్రహం రప్పించింది. కార్యాలయంలోకి వచ్చే మార్గం పూర్తిగా ధ్వంసం కావడంతో ఇటీవల బదిలీ అయిన అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్ కొద్దిరోజుల కిందట సీరియస్ అయ్యారు. దాంతో గుత్తేదారు తాత్కాలికంగా మెరుగులు దిద్దే క్రమంలో ఎర్రమట్టితో గోతులు పూడ్చారు. ఈ తాత్కాలిక చర్యలతో ఒరిగిందేమీ లేదు సరికదా పరిస్థితి మరింత దిగజారింది. సమూలంగా బురదమయమైన ఈ దారి ప్రత్యక్ష నరకాన్ని తలపిస్తోంది. ఫుడ్ కంట్రోలర్ కార్యాలయంలోకి మార్గం పూర్తిగా లేకుండా పోయింది. ఆ మార్గం నుంచి వెళుతున్న ద్విచక్రవాహనాలు, కాలినడకన వెళ్లేవారు జారిపడుతున్నారు. అధికారుల కార్లు బురదలో దిగబడిపోతున్నాయి. ఫుడ్ టెస్టింగ్ మొబైల్ వాహనం కూడా ఆవరణ నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఆహార తనిఖీలకు కూడా ఆటంకం ఏర్పడే పరిస్థితి నెలకొంది. ఆ శాఖను పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి మార్గాన్ని పునర్నిర్మించాలని అంతా కోరుతున్నారు.

గుప్త నవరాత్రులు ప్రారంభం

కాకినాడ రూరల్: వారాహి అమ్మవారి గుప్త నవరాత్రులు కాకినాడ రూరల్‌లో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏడీబీ రోడ్డును ఆనుకుని తమ్మవరం గ్రామ పరిధిలో పాముగుంట జంక్షన్ వద్ద ఐశ్వర్య వారాహి ధర్మక్షేత్రంలో వంటెద్దు గంగా ప్రసాద్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు, అమ్మవారి దీక్షలు ప్రారంభమయ్యాయి. రమణయ్యపేట ఏపీఎస్పీ సమీపంలో హ్రీం పీఠంలో నిర్వాహకుడు ఈశ్వర్ ఆధ్వర్యంలో వారాహి గుప్త నవరాత్రులు నిర్వహించారు. హోమం, అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మినిస్టీరియల్ ఉద్యోగులకు స్థానచలనం

కాకినాడ క్రైం: రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు డీఎస్‌వీఎల్ నరసింహం ఆదేశాల మేరకు స్థానిక జీజీహెచ్‌లో మినిస్టీరియల్ ఉద్యోగుల సీట్లలో మార్పులు చోటు చేసుకున్నాయి. గురువారం స్థానిక జీజీహెచ్‌లో పనిచేస్తున్న 30 మంది మినిస్టీరియల్ సిబ్బంది సీట్లు మారుస్తూ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ఆదేశాలిచ్చారు. ఇందులో 21 మంది జూనియర్ అసిస్టెంట్లు, 9 మంది సీనియర్ అసిస్టెంట్లు స్థాన చలనం పొందారు. సీట్ల మార్పుల నేపథ్యంలో గతంలో చోటు చేసుకున్న వివాదాలతో ఆసుపత్రి అధికారులు అప్రమత్తమయ్యారు. మార్పుల విషయాన్ని ముందుగానే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పాటు మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ నాయకులు సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. సీట్ల మార్పుల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు సిబ్బందికి సూచించారు. ఉన్నతాధికారుల సూచనలతో చోటు చేసుకుంటున్న స్థాన చలనాలను సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

పదోన్నతులు కల్పించాలని వినతి

సామర్లకోట: తమకు పదోన్నతులు కల్పించాలని అచ్చంపేటలో ఎమ్మెల్యే చినరాజప్పకు ఆయన స్వగృహంలో నియోజకవర్గ పరిధిలోని మహిళా పోలీసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీలు పారదర్శకంగా జరిగే విధంగా చూడాలన్నారు. అదేవిధంగా మదర్ డిపార్టుమెంట్‌లో పని చేసే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు.

నూకాలమ్మకు పూజలు

బోట్‌క్లబ్: స్థానిక టూటౌన్ వద్ద నూకాలమ్మ అమ్మవారి ఆలయాన్ని విశ్రాంత ఐఏఎస్ అధికారి సీబీ రావు దంపతులు దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆయనకు ఆలయ ఈఓ వీర్రాజు అమ్మవారి ప్రసాదం అందించారు.